

9 నుంచి 18వ తేదీ వరకు 'జన భాగీదారి'


ఏలూరు : డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ఈనెల 19వ తేదీన విజయవాడలో ప్రారంభోత్సవం చేయు సందర్భంగా జనవరి 9 నుంచి 18వ తేదీ వరకు జిల్లా స్థాయిలో జన భాగీదారి కార్యక్రమం నిర్వహించాల్సిందిగా జిల్లా పంచాయతీ అధికారి టి.విశ్వనాథ్ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు జిల్లా స్థాయిలో జన భాగీదారి కార్యక్రమం నిర్వహించుటకు గ్రామ, జిల్లాస్థాయి అధికారులను బాధ్యులుగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 17వ తేదీన ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాలను పూలమాలతో అలంకరించుట, వారి చేత భారత రాజ్యంగా ప్రవేశిక ప్రతిజ్ఞ చేయవలసిందిగా డిపిఒను ఆదేశించారు. గ్రామ పంచాయతీలోని అన్ని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాలను నాడు-నేడు ఫోటోలు పిడిఎఫ్ చేసి మండలాల వారీగా బుక్ లెట్స్ రూపంలో జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయానికి ఈనెల 9వ తేదీలోగా పంపవలసిందిగా ఇఒపిఆర్‌డిలను డిపిఒ ఆదేశించారు.

మండే సూర్యున్ని.. అంగన్వాడీల సత్తా.. చూడు

- కలెక్టరేట్ వద్ద మహాధర్నాకు వేలాదిగా తరలొచ్చిన అంగన్‌వాడీలు
- 144 సెక్షన్ విధించినా బెదరం..అదరం అంటూ ముందుకు
- నోటీసులు, అడ్డగింతలతో పోలీసుల హడావుడి.. వెంటనే వెనక్కి
- జ్యూట్‌మిల్లు నుంచి కలెక్టరేట్ వరకూ భారీ ప్రదర్శన
- ఆందోళనలో పాల్గొన్న ఎఐటియుసి, ఐఎఫ్‌టియు
- సమస్యలు పరిష్కరించకపోతే మున్ముందు రణరంగమే
- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు

అంగన్వాడీల సమ్మె తీవ్రరూపం దాల్చింది. 23 రోజులుగా అలుపెరగని పోరాటం చేస్తున్న అంగన్వాడీలు బుధవారం కన్నెర్రజేశారు. ప్రభుత్వ తీరుపై విసుగెత్తిన అంగన్వాడీలు ఎపి అంగన్వాడీల వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద చేపట్టిన మహాధర్నా చూసి పోలీసులు, ప్రజానీకం సైతం నివ్వెరపోయారు. 144 సెక్షన్ విధించినా ఏమాత్రం లెక్క చేయకుండా పోలీసుల ఆంక్షలు, నిర్బంధాన్ని దాటుకుని వేలాది మంది అంగన్వాడీలు ఏలూరు చేరుకుని మహాధర్నాలో పాల్గొన్నారు. జ్యూట్‌మిల్లు నుంచి కలెక్టరేట్ వరకూ సాగిన మహాప్రదర్శనలో అంగన్వాడీల నినాదాలు నగరంలో మార్మోగాయి. మండే సూర్యుని చూడు.. అంగన్వాడీ సత్తా చూడు.. అంటూ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎఐటియుసి, ఐఎఫ్‌టియు సైతం మహాధర్నాలో పాల్గొని మద్దతు తెలిపాయి. సిపిఎం, సిపిఐ, సిపిఐ (ఎంఎల్) మద్దతుగా నిలిచాయి. అంగన్వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించకపోతే మున్ముందు రణరంగమే అంటూ ధర్నాలో పాల్గొన్న సిఐటియు నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.


ఏలూరు కలెక్టరేట్ వద్ద బైఠాయించిన అంగన్వాడీలు


సభలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, ఏలూరుఅర్బన్

అంగన్వాడీల సమ్మె పట్ల రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ జిల్లా కేంద్రం ఏలూరులో ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన మహాధర్నాలో అంగన్వాడీలు కదం తొక్కారు. భారీగా తరలొచ్చిన అంగన్వాడీలను చూసి పోలీసులు, అధికారులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. మహాధర్నాను విఫలం చేసేందుకు ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగించినా అంగన్వాడీలు ఏఒక్కటీ లెక్కచేయకుండా ముందుకు సాగారు. ఏలూరులో 144 సెక్షన్ విధిస్తూ మంగళవారం సాయంత్రం తహశీల్దార్ బి.సోమశేఖర్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. ముసునూరు, నూజివీడు వంటి పలుచోట్ల ధర్నాకు వెళ్లకూడదంటూ అంగన్వాడీలకు నోటీసులు జారీచేశారు. బుట్టాయగూడెం నుంచి వస్తున్న అంగన్వాడీలను తడికలపూడి, చింతలపూడిలో, వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న అంగన్వాడీలను చేబ్రోలు, ఏలూరు వంటి ప్రాంతాల్లో పోలీసులు అడ్డుకుని నిర్బంధించేందుకు ప్రయత్నించి.. తర్వాత వెనక్కి తగ్గారు. పోలీసుల ఆంక్షలు, అధికారుల హెచ్చరికలను ఏ వ ా (త ఁ ం లెక్కచేయకుండా వేలాది మంది అంగన్వాడీలు ఏలూరు చేరుకున్నారు. ఏలూరు జ్యూట్‌మిల్లు నుంచి ఫైర్‌స్టేషన్, జిల్లా పరిషత్ సెంటర్ మీదుగా కలెక్టరేట్ వరకూ భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీలు 'భగభగ మండే సూర్యున్ని చూడు.. అంగన్వాడీ సత్తా చూడు' అంటూ నినదించారు. ఎఐటియుసి, ఐఎఫ్‌టియు నేతలు సైతం అంగన్వాడీల మహాధర్నాకు మద్దతు పలికారు. ప్రదర్శన కలెక్టరేట్ వద్దకు చేరుకునేసరికి పోలీసులు అక్కడ పెద్దఎత్తున మొహరించారు. అంగన్వాడీలు కలెక్టరేట్‌ను ముట్టడిస్తారేనని ముందుగానే బారికేడ్లు, ఇనుప ముళ్లకంచెలు ఏర్పాటు చేశారు. అయితే అంగన్వాడీలు కలెక్టరేట్ వద్ద బైఠాయించి సభ నిర్వహించారు. దీంతో ఆ ప్రాంతమంతా కిక్కిరిసిపోయింది. ప్రధాన రహదారి నుంచి కలెక్టరేట్‌కు వెళ్లే రోడ్డు పొడవునా అంగన్వాడీలే ఉండటం చూసి అంతా ఆశ్చర్యపోయారు.

సమస్యలు పరిష్కరించకపోతే మున్ముందు రణరంగమే

కార్మిక సంఘాల నాయకులు

కలెక్టరేట్ వద్ద యూనియన్ జిల్లా కార్యదర్శి పి.భారతి అధ్యక్షతన సభ నిర్వహించారు. సభలో ముఖ్యవక్త సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ గడిచిన 23 రోజులుగా అంగన్వాడీలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం మొద్దునిద్ర నటిస్తుందన్నారు. ఈ నెల ఐదో తేదీలోపు విధుల్లో చేరకపోతే ఉద్యోగాలు తీసేస్తామని ప్రభుత్వం బెదిరిస్తుందని, ఇటువంటి హెచ్చరికలకు బెదిరేది లేదని స్పష్టం చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే జగన్ ప్రభుత్వానికి ఇవే ఆఖరి నూతన సంవత్సర శుభాకాంక్షలు అని వ్యాఖ్యానించారు. అంగన్వాడీలతో పెట్టుకుంటే ఏం జరుగుతుందో టిడిపికి తెలుసు అన్నారు. 144 సెక్షన్, 30 యాక్ట్‌లతో బెదిరిస్తున్నారన్నారు. అంగన్వాడీలు దోపిడీలు, దొంగతనాలు ఏమైనా చేశారా అంటూ ప్రశ్నించారు. సమ్మె నోటీసు ఇచ్చారని, శాంతియుతంగా టెంట్‌లో నినాదాలు చేస్తున్నారన్నారు. తప్పుడు లెక్కలతో జగన్ ప్రభుత్వం మభ్యపెట్టాలని చూస్తుందన్నారు. జగన్ వచ్చాక రూ.వెయ్యి మాత్రమే వేతనం పెంచారని, రూ.4,500 పెంచినట్లు అబద్ధం చెబుతున్నారన్నారు. ధరలు 300 శాతం పెరిగితే వేతనాలు పెంచకపోవడం దారుణమన్నారు. జీతం పెంచాలని అడగడం నేరమా అని ప్రశ్నించారు. పాదయాత్రలో మహిళలను ఆశీర్వదించి తెలంగాణకంటే రూ.వెయ్యి అదనంగా ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. తెలంగాణలో ప్రస్తుతం రూ.13,600 వేతనం ఇస్తున్నారని తెలిపారు. మాటతప్పను.. మడమ తిప్పను అని చెప్పి ఇప్పుడు ఇదేంటని నిలదీశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ ఇవ్వాలన్నారు. మహిళలు, బాలింతలు ఉన్నంతకాలం అంగన్వాడీలు ఉంటారన్నారు. నవరత్నాలకు సంబంధించి ఏ ప్రభుత్వ పథకమూ అంగన్వాడీలకు అందకుండా చేశారన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల తొమ్మిదో తేదీ నుంచి కార్మిక సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు సైతం ఆందోళనకు దిగుతాయని, మున్ముందు రణరంగంగా మారుతుందని హెచ్చరించారు. సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్.లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్, ఎఐటియుసి నాయకులు కె.బుచ్చిబాబు, అంజమ్మ, ఐఎఫ్‌టియు నాయకులు బి.వెంకట్రావు, మారెమ్మ మాట్లాడుతూ రాష్ట్రంలో కార్మిక సంఘాలన్నీ అంగన్వాడీలకు వెన్నుదన్నుగా నిలబడ్డాయన్నారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే ఉద్యోగులంతా కలిసికట్టుగా తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ అంగన్వాడీల పట్ల ప్రభుత్వం దుర్మార్గం వ్యవహరిస్తుందన్నారు. వారి న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. అంగన్వాడీలకు మద్దతుగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణచైతన్య, సిపిఐ (ఎంఎల్) నాయకులు ఎస్.రామ్మోహన్ మాట్లాడారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సుభాషిణి, జిల్లా అధ్యక్షులు ఆలీ, ప్రధాన కార్యదర్శి రవికుమార్ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.విజయలక్ష్మి, టి.మాణిక్యం, పిఎల్ఎస్.కుమారి, రజిని, చెల్లమ్మ, తులసి, రాజకుమారి, తిరుపతమ్మ, స్వర్ణకుమారి, విమల, పుష్ప, లత, సిఐటియు నాయకులు వి.సాయిబాబు, జి.రాజు, ఎం.నాగమణి, ఎస్‌కె.సుభాషిణి, ఆర్‌విఎస్.నారాయణ, నారపల్లి రమణరావు, ఎం.దుర్గారావు, బి.జగన్నాథం, జె.గోపి తదితరులు పాల్గొన్నారు.



నిరసన సభలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు



కలెక్టరేట్ వద్ద పోలీసులు అడ్డుగా వేసిన ఇనుప కంచె

బకాయిలు చెల్లించాలని యుటిఎఫ్ 12 గంటల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని, సుమారు రూ.20 వేల కోట్లు ఆర్థిక బకాయిలన్నింటినీ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు స్థానిక జిల్లా కలెక్టరేట్ వద్ద బుధవారం 12 గంటల ధర్నా నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ ముస్తఫాఅలీ అధ్యక్షతన చేపట్టిన ధర్నాను ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జెఎసి ఛైర్మన్ చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి రామారావు ప్రారంభించారు. ఈ ధర్నానుద్దేశించి యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్ మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఈ ప్రభుత్వం మాట తప్పిందని, మడమ తిప్పిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చాక ఒక్క డిఎ కూడా ఇవ్వకపోగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు దాదాపు రూ.20 వేల కోట్లు బకాయిలు పడిందని, తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి మాట్లాడుతూ ప్రభుత్వం పెండింగులో ఉన్న బకాయిలను చెల్లించని పక్షంలో ఈ నెల 9, 10 తేదీల్లో రాష్ట్రస్థాయిలో 36 గంటల ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు పివి.నరసింహారావు, ఎంవి.శ్యాంబాబు, వి.కనకదుర్గ, జి.వెంకటేశ్వరరావు, కోశాధికారి జివి.రంగమోహన్, సాగర్‌బాబు, బి.అనురాధ, ఎన్.రాంబాబు అల్లాడి రాజు, పి.శ్రీనివాస్, ఎస్.సుధారాణి, సిహెచ్.శ్రీధర్, జి.దేవానంద్, కె.కమల్‌కుమార్, వందలాదిమంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ధర్నాలో నినదిస్తున్న ఉపాధ్యాయులు

12 వరకూ ఓటర్ల జాబితాపై అభ్యర్థనల స్వీకరణ



ఏలూరు: ఎన్నికల సంఘం తుది ఓటర్ల జాబితా విడుదల గడువు పొడిగించినందున ఈ నెల 12వ తేదీ వరకు ఓటర్ల నమోదుకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలకు సంబంధించిన అర్జీలను స్వీకరిస్తామని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చెప్పారు. జిల్లాలో స్వచ్ఛమైన, స్పష్టమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు రాజకీయ పక్షాలు సహకరించాలన్నారు. బుధవారం స్పెషల్ సమ్మరీ రివిజన్-2024, ఇతర ఎన్నికల అంశాలపై రాజకీయ పక్షాల ప్రతినిధులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తుది ఓటర్ల జాబితా విడుదల గడువు ఈ నెల 22కు పొడిగించినందున ఈ నెల 12వ తేదీ వరకు ఓటర్ల నమోదు, అభ్యంతరాల స్వీకరణ చేపట్టాలన్నారు. గత డిసెంబర్ 9వ తేదీ తర్వాత అందిన ప్రతి క్లెయిమ్‌ను నిర్ణీత గడువులో పరిష్కరించాలన్నారు. జిల్లాలో ఈ నెల రెండో తేదీ నాటికి 16,23,530 మంది ఓటర్లుగా నమోదై ఉన్నారన్నారు. జిల్లాలో ఇంతవరకు 7,787 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా వాటిలో ఫారం-6 కింద 2028, ఫారం-7 కింద 3086, ఫారం-8 కింద 2673 దరఖాస్తులు ఉన్నాయన్నారు. ఇవన్నీ డిసెంబర్ 9వ తేదీ తర్వాత వచ్చినవేనన్నారు. జిల్లాలోని అన్ని పోలింగ్ స్టేషన్లో మౌలిక సదుపాయాలను తనిఖీ చేయాలని ఎఇఆర్‌ఒలు, ఇఆర్‌ఒలను ఆదేశించామని, రెండు రోజులుగా వారు వాటిని పరిశీలిస్తున్నారని తెలిపారు. రాజకీయ పక్షాల ప్రతినిధులు కూడా తమ పరిధిలోని పోలింగ్ స్టేషన్లను పరిశీలించి ఏమైనా లోటుపాట్లు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో డిఆర్‌ఒ ఎం.వెంకటేశ్వర్లు, సిర్రా భరత్ (బిఎస్‌పి), నెరుసు నెలరాజు (బిజెపి), ఎస్‌బి.ప్రసాద్ (కాంగ్రెస్), ఎం.దశరథకుమార్ (ఆమ్‌ఆద్మీ), పాలి ప్రసాద్ (టిడిపి), కలెక్టరేట్ ఎఒ రమాదేవి, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ చల్లన్న దొర పాల్గొన్నారు.

అంగన్వాడీలు విధులకు హాజరు కావాలి: కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజాప్రయోజనాల దృష్ట్యా అంగన్వాడీలు సమ్మె విరమించి ఈ నెల ఐదో తేదీలోగా విధులకు హాజరు కావాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో కోరారు. అధికారులు శాఖా పరమైన చర్యలకు ఆలోచన చేయకుండా వ్యవహరించాలని పేర్కొన్నారు. అంగన్వాడీలు విధులకు హాజరు కాకపోవడంతో పోషకాహార కిట్లు, గుడ్లు, పాలు, సప్లిమెంటరీ న్యూట్రిషన్ లబ్ధిదారులకు అందడం లేదని తెలిపారు. వీటన్నింటి రీత్యా సమ్మె విరమించాలని కలెక్టర్ కోరారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె ఉధృతం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మంగళవారం ప్రభుత్వంతో జరిగిన చర్చలు విఫలం అయిన నేపథ్యంలో మున్సిపల్ కార్మికుల సమ్మె ఉధృతం చేస్తున్నట్లు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్(సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జాన్ బాబు అన్నారు. ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికుల 9వ రోజు సమ్మె శిబిరం బుధవారం కొనసాగింది. బుధవారం ఉదయం మున్సిపల్ కార్మికులు వివిధ సర్కిల్స్‌కు వెళ్లి మున్సిపల్ ట్రాక్టర్లను అడ్డుకున్నారు. సమ్మెకు మద్దతు ఇవ్వవలసిందిగా పనిచేస్తున్న పోటీ కార్మికులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం మున్సిపల్ ఆఫీసు వద్ద సమ్మె శిబిరంలో జాన్‌బాబు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు ప్రజానికానికి ఎంతో విలువైన సేవలు అందిస్తున్నారని, తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజల ఆరోగ్యాలను కాపాడుతున్నారన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పట్ల వైఎస్ జగన్మోహన్ రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మున్సిపల్ కార్మికులకు 2019 ఎన్నికలకు ముందు వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలోనూ, అసెంబ్లీలోను ఇచ్చిన హామీలకు అనుగుణంగా వెంటనే పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి బంగారు వెంకటేశ్వర్లు, ఆముదాల యేసు రత్నం, పంతం చిన్న నాగరాజు, బండి రాజు, మహిళా కార్మిక నాయకులు మేతర పాప, బండి భవాని, నక్క భాగ్యలక్ష్మి, లావేటి లక్ష్మి, రమణమ్మ శివకొండ, లీలావతి, కాంతమ్మ నాయకత్వం వహించారు. జనసేన నాయకురాలు ఘంటసాల వెంకటలక్ష్మి తన మద్దతు తెలియజేశారు. మున్సిపల్ కార్మికుల సాగిస్తున్న న్యాయమైన పోరాటానికి తమ మద్దతు ఉంటుందని తెలిపారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరతూ ఎఐటియుసి ఆధ్వర్యంలో ఏలూరులో నగరపాలక సంస్థలో పనిచేస్తున్న కార్మికులు బుధవారం నుంచి సమ్మెలోకి వెళ్లారు. సమ్మె సందర్భంగా నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద అనుబంధ ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏర్పాటు చేసిన నిరవధిక సమ్మె శిబిరాన్ని ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. సమ్మె శిబిరంలో పాల్గొన్న కార్మికులను ఉద్దేశించి ఎఐటియుసి జిల్లా గౌరవాధ్యక్షులు కె.కృష్ణమాచార్యులు, జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు పోలా భాస్కర రావు, గేదెల నాగేశ్వరరావు నాయకత్వం వహించారు.

చింతలపూడి : చింతలపూడి పట్టణంలో నగరపంచాయతీ వద్ద సిఐటియు యూనియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె బుధవారం 9వ రోజుకి చేరుకుంది. తమ న్యాయమైన డిమాండ్లు అమలు చేసే వరకు ఉద్యమం ఆగేది లేదని వారు స్పష్టం చేశారు. చింతలపూడి నగరపంచాయతీ మున్సిపల్ కార్మికులు సమస్యలు నెరవేర్చాలని, అప్కాస్‌లో చేర్చాలని, హెల్త్ ఎలవెన్సులు ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, పద్మ, కమలమ్మ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర జెఎసి పిలుపులో భాగంగా చింతలపూడి నగర పంచాయతీలో ఎఐటియుసి అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు సమ్మెబాట పట్టారు. కొంతమంది వర్కర్స్‌తో నగర పంచాయతీ అధికారులు పని చేయిస్తుండగా వారు చేయిస్తున్న పనిని మున్సిపల్ కార్మికులు అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తొర్లపాటి బాబు పాల్గొన్నారు.


ఏలూరులో మున్సిపల్ ట్రాక్టర్లను అడ్డుకున్న కార్మికులు



నమూనా చెక్కు అందిస్తున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్, కలెక్టర్

జిల్లాలో కొత్తగా 4,096 పెన్షన్లు మంజూరు

జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

వైఎస్ఆర్ పింఛను కానుక కింద జిల్లావ్యాప్తంగా అన్నిరకాల పెన్షన్లకు సంబంధించి జనవరి నెలకు 2,72,955 మందికి రూ. 81.53 కోట్లు విడుదల చేశారని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చెప్పారు. జిల్లాలో కొత్తగా 4,096 పెన్షన్లు మంజూరు చేసినట్లు వివరించారు. వైఎస్ఆర్ పెన్షన్ కానుక పెంపులో భాగంగా పెన్షన్ రూ.3 వేలు అందించే కార్యక్రమాన్ని సిఎం జగన్ కాకినాడలో ప్రారంభించగా స్థానిక జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, పెన్షన్ లబ్దిదారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సాహిత్య మండలి ఛైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ ఆర్.విజయరాజు, బిసి కార్పొరేషన్ ఇడి ఎన్.పుష్పలత, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి కుముదినీసింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెన్షన్ లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేశారు. అనంతరం కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో ఫించన్ల పంపిణీ ఈ నెల ఎనిమిదో తేదీ వరకూ ఆయా మండలాలు, మున్సిపాల్టీల్లో నిర్వహిస్తున్నామన్నారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ జిల్లాలో 2019 నుంచి ఇప్పటి వరకు కొత్తగా లక్షా 8,905 కొత్త పెన్షన్లు సిఎం జగన్ మంజూరు చేశారన్నారు.


ఏలూరు కలెక్టరేట్ వద్ద నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

15వ రోజు సమ్మెలో సమగ్రశిక్ష ఉద్యోగులు


ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల రాష్ట్రవ్యాప్త సమ్మె 15వ రోజుకి చేరింది. ఈ సందర్భంగా ఏలూరు కలెక్టరేట్ వద్ద బుధవారం నిరసన కొనసాగింది. సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ పెద్దఎత్తున నినదించారు. ఈ సందర్భంగా జెఎసి నేతలు మాట్లాడుతూ విద్యాశాఖలో కీలకపాత్ర వహిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తాననే వాగ్దానాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు పిఆర్‌సి అమలు చేయకుండా, నెలలు తరబడి వేతనాలు విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్యాయంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. సమగ్ర శిక్ష ఉద్యోగులందరికీ హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్, కార్యదర్శి నంబూరి రాంబాబు, కైకలూరు ఎంఇఒలు రామారావు, శ్రీనివాస్, తదితరులు సమగ్ర శిక్ష ఉద్యోగుల శిబిరాన్ని సందర్శించి మద్దతుగా ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా జెఎసి నాయకులు వినోద్, జాన్సీ, భగవాన్, సత్య, సందీప్, దిలీప్ పాల్గొన్నారు.

భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి - చింతలపూడి

ఎపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ 27/2023ను రద్దు చేయాలని చింతలపూడి బార్ అసోసియేషన్ అధ్యక్షులు కాకర్ల మాణిక్యాలరావు, బి.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. చింతలపూడి పట్టణంలో బార్ అసోషియేషన్ ఆధ్వర్యంలో బుధవారం న్యాయవాదుల రిలే దీక్షలు రెండవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ 27/2023 పేద ప్రజలకు నిరుపయోగంగా మారుతుందన్నారు. రాజకీయ నాయకులు, భూస్వాములకు అనువుగా ఉందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో గంటా రంజిత్ కుమార్, డేవిడ్, రమేష్, నరకుళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.



ఎంఎల్ఎను సత్కరిస్తున్న సంధ్యా దంపతులు

రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా గంటా సంధ్య

ప్రజాశక్తి - ముదినేపల్లి

రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా గంటా సంధ్య మరోసారి నియమితులయ్యారు. బుధవారం ముదినేపల్లిలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరావు ఈ విషయం ప్రకటించారు. ఇప్పటికే రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా రెండు సంవత్సరాల పాటు గంటా సంధ్య పనిచేశారు. హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మరోసారి అవకాశం కల్పించినందుకు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరావుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గంటా సంధ్య దంపతులు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరావును పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

'జనసేన, టిడిపి ఉమ్మడి ప్రభుత్వాన్ని స్థాపిద్దాం'

ప్రజాశక్తి - ఉంగుటూరు

రానున్న ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించి జనసేన-టిడిపి ఉమ్మడి ప్రభుత్వాన్ని స్థాపించేందుకు కార్యకర్తలంతా కృషి చెయ్యాలని జనసేన నియోజకవర్గం ఇన్‌ఛార్జి ధర్మరాజు, జిల్లా టిడిపి అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు పేర్కొన్నారు. బుధవారం ఉంగుటూరు నియోజకవర్గం జనసేన కార్యాలయం వద్ద పత్సమట్ల ధర్మరాజు ఆధ్వర్యంలో జనసేన-టిడిపి ఉమ్మడి సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా టిడిపి అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు విచ్చేశారు. ఈ సందర్భంగా ధర్మరాజు మాట్లాడుతూ ఇరు పార్టీల నాయకులు గ్రామ స్థాయి నుంచి సమన్వయంతో కలిసి పని చెయ్యాలన్నారు. రానున్న రోజుల్లో పవన్ కళ్యాణ్, చంద్రబాబు నాయకత్వాన్ని బలపరిచి రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ టికెట్ ఏ పార్టీకి ఇచ్చిన కలిసికట్టుగా పని చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం జనసేన-టిడిపి ముఖ్య నాయకులు, వీర మహిళలు, కార్యకర్తలు, జనసైనికులు పాల్గొన్నారు.

'అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు'

ప్రజాశక్తి - ఉంగుటూరు

23వ రోజు సమ్మె సందర్భంగా కలెక్టరేట్ కార్యాలయం దగ్గరికి నిరసన తెలియజేయడానికి వెళుతున్న ఆర్‌టిసి బస్సు నుంచి పోలీసులను అంగన్వాడీ కార్యకర్తలను దింపివేసి పోలీస్ స్టేషన్ తరలించారు. అరెస్టు అయినవారిలో రమణారావుతో పాటు మరో 30 మంది అంగన్వాడీ వర్కర్స్ పద్మావతి, అరుణ, జ్యోతి, వెంకటలక్ష్మి, శాంతి కుమారి, జాన్సీ, రమ్య ఉన్నారు. తక్షణమే విడుదల చేయలని ధర్నా చేశారు. అనంతరం విడుదల చేశారు.

కొయ్యలగూడెం: మండలకేంద్రంలో అంగన్వాడీ నిరసనలు 23 రోజుకు చేరుకున్నాయి. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పేర్ యూనియన్ పిలుపు మేరకు కలెక్టరేట్ ముట్టడి నేపథ్యంలో భాగంగా కొయ్యలగూడెం నుంచి అంగన్వాడీలు కదలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు శుక్లబోయిన రాంబాబు, అంగన్వాడీ ప్రాజెక్ట్ అధ్యక్షులు శివరత్న కుమారి, పి.పద్మజ, జె.నాగవేని, అడపా నాగజ్యోతి, సిహెచ్.సునితరయల్, బొబ్బిలి చిట్టి, కె.జ్యోతి, కె.మాధవి, పి.భాగ్యలక్ష్మి, ఎమ్.వెంకటలక్ష్మి, ఎమ్.మంగా, శ్రీదేవి పాల్గొన్నారు.

కలిదిండి : స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేస్తున్న సమ్మెలో భాగంగా 23వ రోజు ఏలూరు కలెక్టరేట్ ముట్టడికి తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సంఘం నాయకులు షేక్ అబిదా బేగం, జక్కంశెట్టి మేనక లక్ష్మి, కొప్పినీడి రమాదేవి, మండల పరిధిలోని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ పాల్గొన్నారు.

6న వైఎస్ఆర్ చేయూత మహిళా మార్ట్ ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు

నూజివీడు మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నూజివీడులో ఈనెల 6వ తేదీ శనివారం ఉదయం 9 గంటలకు కొత్తగా ప్రారంభించబడుతున్న వైఎస్ఆర్ చేయూత మహిళా మార్ట్ ప్రారంభోత్సవానికి నూజివీడు మండల మహిళా సమాఖ్య పాలకవర్గ సభ్యులు, జిల్లా సమాఖ్య పాలకవర్గ సభ్యులు ఆహ్వాన పత్రికను జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌కు అందజేసి ఆహ్వానించారు. మండలంలోని 62 గ్రామసంఘాల్లోని 18,643 సభ్యులు ఒక్కొక్కరు రూ.200 వాటాధనంతో కూడిన రూ.36 లక్షల పెట్టుబడితో వైఎస్ఆర్ చేయూత మహిళా మార్ట్‌ను ప్రారంభిస్తున్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ ఆర్.విజయరాజు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న బుద్ధవ్యాస్

ఎస్‌టియు డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఎస్‌టియు రాష్ట్ర శాఖ ముద్రించిన డైరీ, క్యాలెండర్‌ను పెదవేగి మండల విద్యాశాఖాధికారి బుద్ధవ్యాస్ బుధవారం పెదవేగిలో ఆవిష్కరించారు. బుధవ్యాస్ మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ఉపాధ్యాయులు సమిష్టిగా పనిచేసి మండలంలో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు నాగార్జున, ఎమ్‌డీ షఫి, భూషణం, సూర్యనారాయణ, ప్రవీణ్, గుప్తా, రమేష్ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

నాటుసారా తరలిస్తున్న వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి - టి.నరసాపురం

నాటుసారా అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌బి సురేంద్ర కుమార్ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కామవరపుకోట మండలం జీలకర్రగూడెం గ్రామానికి చెందిన వ్యక్తి అక్రమంగా తెలంగాణా రాష్ట్రానికి నాటుసార తరలిస్తున్నారనే సమాచారంతో తన సిబ్బందితో టి.నరసాపురం మండలం మర్రిగూడెం పంచాయతీలోని లంకాలపల్లి చెక్‌పోస్టు వద్ద దాడి చేసి రెండు లీటర్లు నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి


మండలంలోని తాటియాకులగూడెం అంతర్రాష్ట్ర తనిఖీ కేంద్రం వద్ద బుధవారం తెలంగాణా మద్యం బాటిళ్లు 6 పట్టుకున్నామని హెడ్ కానిస్టేబుల్ కె.నాగేశ్వరావు తెలిపారు. వాహనాల తనిఖీ చేస్తుండగా తెలంగాణా రాష్ట్రం నుంచి జి.సత్యనారాయణ తన వద్ద ఉన్న బ్యాగ్‌లో 6 బాటిళ్ల మద్యాన్ని పెట్టుకొని అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. ఆ బాటిళ్లను సీజ్ చేసి, వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

చదువుల తల్లి 'సావిత్రిబాయి పూలే'


ఘనంగా 193వ జయంతి

ప్రజాశక్తి - చింతలపూడి

భారతదేశపు మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు, మహిళా చైతన్య మూర్తి సావిత్రిబాయి పూలే అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు అన్నారు. చింతలపూడి పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద సావిత్రిబాయి పూలే 193వ జయంతి వేడుకలు కళాశాలలో ఇంగ్లీషు, ఎన్ఎస్ఎస్ శాఖల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సావిత్రిబాయి బహుజన జీవితాలను ఎలా ప్రభావితం చేసిందో, ఎలా ఆదర్శమూర్తిగా నిలబడిందో వివరించారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజంలో స్త్రీ విముక్తికై పోరాడిన ధీశాలి అని కొనియాడారు. అనంతరం కల్చరల్ కోఆర్డినేటర్ డాక్టర్ బి.సరస్వతి వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో మౌనిక పాల్గొన్నారు.



భీమడోలు : అన్నేవారి గూడెంలో..



చింతలపూడిలో..

భీమడోలు : మహిళల విద్యా వ్యాప్తికి కృషి చేసిన తొలి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమాలను మండలంలోని పలు పాఠశాలల్లో బుధవారం నిర్వహించారు. దీనిని ప్రభుత్వం జాతీయ మహిళా దినోత్సవంగా ప్రకటించిన నేపథ్యంలో సదరు కార్యక్రమాలను నిర్వహించిన పాఠశాలల యాజమాన్యాలు తమ సంస్థల్లో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు. అన్నేవారి గూడెం ఎంపిపి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు మస్తాన్ ఆధ్వర్యంలో కార్యక్రమంపై వ్యాసరచన, వకృత్వ పోటీలను నిర్వహించారు. మహిళా విద్య ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

మండవల్లి : మహిళల జీవితంలో విజ్ఞానాన్ని పెంపొందించిన మహోన్నత వ్యక్తి సావిత్రిబాయి పూలే అని ప్రొఫెసర్ సుధా బత్తుల విజయ్ కుమార్ పేర్కొన్నారు. సావిత్రిబాయి పూలే 193వ జయంతిని పురస్కరించుకొని బుధవారం గ్రంథాలయ ఆవరణంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హక్కుల కోసం జీవితాంతం పోరాడిన దీశాలి సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. మహిళలకు చదువుకునే అవకాశం లేన ఆ రోజుల్లో సమాజ కట్టుబాట్లను ఎదిరించి దేశంలోనే మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయినిగా బాలికలకు విద్యనందించి చరిత్ర సృష్టించారని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ సావిత్రిబాయి, జ్యోతిరావు పూలే ఆశయాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లే విధంగా కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు, సామాజికవేత్త ఎల్ఎస్.భాస్కరరావు, గ్రంథాలయం నిర్వాహకురాలు షేక్ పరివిన పాల్గొన్నారు.

ఏలూరు టౌన్: విద్య ద్వారానే సమాజ పురోగతి సాధ్యపడుతుందని ఆచరణలో రుజువు చేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని వక్తలు కొనియాడారు. చదువుల తల్లి, క్రాంతి జ్యోతి సావిత్రిబాయి పూలే 193వ జయంతి బుధవారం ఉదయం స్థానిక ఆర్ఆర్ పేటలోని బిసి సబ్‌ప్లాన్ ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్ల సాధన పోరాట వేదిక ఆధ్వర్యంలో ఆ సంఘం జిల్లా కార్యాలయంలో జరిగింది. ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి ప్రజాశక్తి బుక్ హౌస్ నిర్వాహకురాలు హరిప్రియ పూలమాలవేసి జోహార్లు అర్పించారు. అనంతరం జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు మాట్లాడుతూ స్త్రీ విద్య కోసం తన భర్త మహాత్మా జ్యోతిరావు పూలే అడుగుజాడల్లో నడిచి, ఎన్నో ఇబ్బందులను సైతం ఎదుర్కొని, తన తోటి మహిళలకు తన ఇంటినే పాఠశాలగా మార్చి విద్యాబుద్ధులు నేర్పిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని కొనియాడారు.



మండవల్లిలో..

రైతులకు తోడ్పాటునందిస్తున్న 'దాకరం సొసైటీ'

ప్రజాశక్తి - ముదినేపల్లి

దాకరం సొసైటీ సేవల్లో ముందుంటూ రైతుల మన్ననలు పొందుతోంది. రైతులకు వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. ఇలాంటి కీలకమైన రంగానికి సేవలందించడంలో పిఎసిఎస్‌లే ముఖ్యపాత్ర వహిస్తున్నాయి. రైతులు ఆర్థికంగా చితికిపోకుండా సహకార సంఘాలు ఎంతో తోడ్పాటును అందిస్తున్నాయి. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు రైతులకు రుణాలను ఇవ్వడమే కాకుండా వారిని ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నాయి.



సొసైటీ భవనం

దాకరం సొసైటీ 1959లో ప్రారంభమైంది. అప్పట్లో సొసైటీ భవన నిర్మాణానికి గ్రామానికి చెందిన అట్లూరి వెంకటసుబ్బారావు 12 సెంట్లు స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. ఆ స్థలంలో సొసైటీ భవన నిర్మాణం జరిగింది. సొసైటీ ఏర్పడినప్పటి నుంచి కూడా ఎన్నికలు జరుగుతూనే ఉన్నాయి. 2009లో మాత్రమే సొసైటీ ఎన్నిక ఏకగ్రీవమైంది. సొసైటీ అధ్యక్షుల పర్యవేక్షణ, సిబ్బంది పనితీరు, సభ్యుల సహకారం ఉండడంతో గణనీయంగా డిపాజిట్లు పెరిగాయి. ప్రస్తుతం సంఘ సభ్యులు 563 మంది ఉన్నారు. డిపాజిట్లు రూ.4.34 కోట్లు, షేర్ ధనం రూ.46.57 లక్షలు, ఇన్వెస్టిమెంట్ రూ.5.27కోట్లు, సంఘ సభ్యులకు ఇచ్చిన రుణాలు రూ.8.50 కోట్లు, రిజర్వు నిధులు రూ.58 లక్షలు, బారోయింగ్ రూ.8.40 కోట్లు కలిగి ఉన్నాయి.

వార్షిక టర్నోవర్ : సహకార బ్యాంకు వార్షిక టర్నోవర్ రూ.12.84 కోట్లతో వ్యాపారం కొనసాగిస్తుంది. పంట రుణాలు, చేపల మేత వివిధ రకాల రుణాలు మంజూరు చేస్తున్నారు. దాకరం, పేరూరు, పెయ్యేరు, అప్పారావుపేట, కాకరవాడ, దేవరం గ్రామాల రైతులు, ప్రజలకు సేవలందిస్తోంది. రైతులకు, ప్రజలకు చేయూతనిస్తూ రైతాంగాన్ని అన్నివిధాలా ఆదుకుంటూ సొసైటీని ముందుకు నడిపిస్తున్నారు.

సహకార సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసింది

2022-23లో నికర లాభం రూ.11.96 లక్షలు వచ్చింది. సహకార సంఘాలను చైతన్యపరిచి అనేక రకాలుగా అభివృద్ధి చేయటానికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. సహకార సంఘాల ద్వారా రైతులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలతో పాటు ఎరువులు, పురుగుమందులు అందజేస్తున్నాం. నేడు సహకార సంఘాలు రైతులకు అండగా నిలుస్తున్నాయి. సహకార సంఘాలను వాణిజ్యపరంగా కూడా అభివృద్ధి చేస్తూ ఆదర్శంగా నిలుస్తుందన్నారు. రైతులు సహకార సంఘం సేవలను సద్వినియోగం చేసుకోవాలి.



సొసైటీ ఛైర్మన్ ఎస్‌వివి.సత్యనారాయణ, దాకరం సొసైటీ

ప్రణాళికతోనే సహకార సంఘాల అభివృద్ధి

సహకార సంఘాలు రైతుల సంక్షేమం కోసం ఏర్పడింది. వీటి అభివృద్ధికి ఒక నిర్దిష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించి రైతులకు రుణాలు అందిస్తున్నాం. సహకార సంఘాలు విత్తనాలు, ఎరువులు సరఫరాలే కాకుండా సొసైటీ ఆర్థికంగా అభివృద్ధి చెందటానికి పార్టీలకు అతీతంగా పనిచేస్తు రైతులకు మెరుగైన సేవలు అందిస్తున్నాం.



ఎల్ఎస్ పి.ప్రసాదరావు సిఇఒ

జగనన్న స్పూర్తి స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

పదవ తరగతి విద్యార్థులకు జగనన్న స్పూర్తి స్టడీ మెటిరియల్ ఎంతగానో దోహదపడుతుందని ఆగిరిపల్లి జడ్‌పిటిసి పి.వీరబాబు అన్నారు. బుధవారం ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు జగనన్న స్పూర్తి-భవితకు భరోసా స్టడీ మెటీరియల్‌ను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు సర్వేశ్వరరావు, ఆనంద్‌కుమార్, ప్రధానోపాధ్యాయురాలు పుష్పలత, వైసిపి నాయకులు నరశింహారావు, ఇస్సాక్, సుజన కుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ


ప్రజాశక్తి - ఏలూరు టౌన్

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని అనురాగ్ నగర్ వద్ద ఉన్న అనురాగ్ స్కూల్‌లో 100 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసి, అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అనురాగ్ స్కూల్ ఛైర్మన్ జి.పీటర్ దుప్పట్లను అందజేశారు. ఈ సందర్భంగా పీటర్ మాట్లాడుతూ జీవిత చరమాంకంలో ఉన్న వృద్ధులకు ప్రతీ ఏటా దుస్తులు, దుప్పట్లు అందించడం ఆనందంగా ఉందన్నారు. వృద్ధులు ఎవరు ఆసరాగా లేరనే బాధను విడనాడి, ఆనందంగా జీవించాలన్నారు. వృద్ధులు అనవసర విషయాలను వదిలేసి, ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ జి.కుమారి, కోమ్మిక్, మహాలక్ష్మి టీచర్, చిట్టిబాబు పాల్గొన్నారు.

ఆర్మడ్ రిజర్వు ఫోర్స్ డిఎస్‌పిగా చంద్రశేఖర్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఆర్మూర్ రిజర్డ్వ్ ఫోర్స్ డిఎస్‌పిగా బి.చంద్రశేఖర్ బుధవారం ఏలూరు ఫోర్సు కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఎఆర్‌డిఎస్‌పిగా కృష్ణంరాజు ఇప్పటి వరకు విధులు నిర్వహించారు. ఆయన స్థానంలో చంద్రశేఖర్ ఎఆర్‌డిఎస్‌పిగా నియమితులయ్యారు ఆయన బుధవారం ఎఆర్‌డిఎస్‌పి కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి చంద్రశేఖర్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ సిబ్బంది సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎఆర్ సిబ్బందికి గ్రీవెన్స్ ప్రతి వారం ఏర్పాటు చేసి వారి సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని ఆమె ఆయనకు సూచించారు.



బాధితులకు సాయం చేస్తున్న లవ్‌ఇన్ యాక్షన్ సంస్థ

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ఉంగుటూరు : ఉంగుటూరులో గత నెలలో అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన ఇర్లపాటి జయరాజ్, కార్యం సుబ్బాయమ్మ, బల్లమూడి రాంబాబుల కుటుంబాలకు నారాయణపురం గ్రామానికి చెందిన 'లవ్ ఇన్ యాక్షన్' సంస్థ స్పందించి బియ్యం బస్తాలు, దుప్పట్లు చీరలు సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో లవ్ ఇన్ యాక్షన్ ప్రెసిడెంట్ ఎస్.దికరన్, సెక్రటరీ పి.ప్రసాద్, ట్రెజరర్ అబ్నేర్, డేవిడ్, మోహన్ పాల్గొన్నారు.


నూతన పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - చింతలపూడి

జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ పింఛన్ పెంపు మాట నిలబెట్టుకున్నారని నియోజకవర్గ ఎంఎల్ఎ ఉన్నమాట్ల ఎలిజా అన్నారు. చింతలపూడి పట్టణంలో ఎంపిడిఒ కార్యాలయం వద్ద నూతన పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 2024లో 9,736 మందికి రూ.2 కోట్ల 92 లక్షల 52 వేల 500 ప్రభుత్వం చెల్లిస్తుందని అన్నారు. మండలంలో నూతనంగా 234 పింఛన్లు మంజురైనట్లు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రికే చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కొప్పుల నాగు, సచివాలయ కన్వీనర్ సిటిమెడికల్ దుర్గారావు పాల్గొన్నారు.

ద్వారకా తిరుమల : ద్వారకాతిరుమల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం నూతన లబ్ధిదారులకు రూ.3 వేల పింఛను పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం నియోజకవర్గ ఎంఎల్ఎ తలారి వెంకట్రావు ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు పింఛను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, మండల కన్వీనర్ ప్రతాపనేని శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి చిగురుపల్లి శామ్యూల్, మండల యూత్ అధ్యక్షులు పెద్దిరెడ్డి నాగేశ్వరావు, ద్వారకాతిరుమల ఎంపిటిసి-2 పెద్దిరెడ్డి రమ్య కుసుమ, ఎంపిటిసి-1 రుద్ర సూర్య కళ వెంకట శివాజీ, టౌన్ ప్రెసిడెంట్ అచ్యుత ఏసుబాబు, ద్వారకాతిరుమల మండల నాయకులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : బుట్టాయగూడెం మండల పరిషత్ కార్యాలయం వద్ద నూతన పింఛన్లు, పెరిగిన మొత్తంతో కలిపి రూ.3 వేల పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో నూతనంగా నియమితులైన పోలవరం నియోజకవర్గం ఇన్‌ఛార్జి తెల్లం రాజ్యలక్ష్మి, పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు పాల్గొన్నారు. రాజ్యలక్ష్మి, ఎంఎల్ఎ బాలరాజు చేతుల మీదగా నూతన పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ గంజిమాల దేవి, ఎంపిపి కారం శాంతి, వైస్ ఎంపిపి కుక్కల వరలక్ష్మి పాల్గొన్నారు.



ద్వారకా తిరుమలలో..

పోలవరం : మండలంలో ఎంపిడిఒ కార్యాలయంలో పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు, ఆయన సతీమణి తెల్లం రాజ్యలక్ష్మి కొత్తగా మంజూరైన పింఛన్లను అందజేశారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ పోలవరం నియోజకవర్గం నుంచి ఈసారి నన్ను నమ్మి, నా మీద గౌరవం ఉంచుకుని నా భార్యకు సీటు ఇవ్వడం పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, తహశీల్దార్ బి.సుమతి పాల్గొన్నారు.

ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న శతాధిక వృద్ధురాలు పసుపులేటి వరహాలమ్మ(105)కు బెస్తవీధి వాలంటీర్ పోసి బిబి బుధవారం ఆసుపత్రిలో పెన్షన్ అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు.

ముదినేపల్లి : ప్రజలకు ఇచ్చిన మాటను నిలుపుకొనే నాయకుడు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. ముదినేపల్లిలోని ఎంపిడిఒ కార్యాలయం ఆవరణంలో బుధవారం జరిగిన నూతన పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఆయన, ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి ఈడే వెంకటేశ్వరమ్మ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు డయాబెటిక్‌పై అవగాహన

భీమడోలు : మారుతున్న ఆహారపు అలవాట్ల కారణంగా డయాబెటిక్ వేగంగా విస్తరిస్తుందని, దీని పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని భీమడోలు శ్రీచైతన్య విద్యాసంస్థల ప్రిన్సిపల్ డి.సోహిని కోరారు. విజయవాడకు చెందిన విజిఆర్ డయాబెటిక్ కేంద్రం వారు చైతన్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు డయాబెటిక్‌పై రాష్ట్రస్థాయిలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. దీనిలో పాల్గొన్న భీమడోలు పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను దక్కించుకుని బహుమతులు సాధించారు. భీమడోలు పాఠశాల ఆవరణలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన విద్యార్థులతో పాటు, కన్సోలేషన్ బహుమతులను పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చైతన్య విద్యాసంస్థల ఆర్ఐ సిహెచ్.ఉదయభాస్కర్ పాల్గొన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డీన్ వి.భార్గవ కిరణ్ పాల్గొన్నారు.

ఓటర్ల తుది జాబితా తయారీకి సహకరించాలి

భీమడోలు : ఓటర్ల తుది జాబితాను పారదర్శకంగా తయారు చేసేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని ఉంగుటూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఏలూరు ఆర్‌డిఒ ఖాజావలీ కోరారు. ఈ మేరకు భీమడోలు తహశీల్దార్ కార్యాలయంలో ఓటర్ల జాబితా తయారిపై నియోజకవర్గ స్థాయిలోని వివిధ రాజకీయ పార్టీలతో బుధవారం సమీక్షా సమావేశాన్ని ఆర్‌డిఒ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు వచ్చినప్పుడు ఏడు రోజుల వ్యవధిలో తర్వాత వివిధ విభాగాల ద్వారా క్షేత్రస్థాయిలో విచారణ చేసి అభ్యంతరాలపై తుది నిర్ణయం తీసుకుంటారన్నారు. గత సంవత్సరం అక్టోబర్ 23 తర్వాత నియోజకవర్గ పరిధిలో 16 వేల అభ్యంతరాలు రాగా విచారణ అనంతరం సమస్యను పరిష్కరించామన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఓటర్ల జాబితా మేరకు 214 పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు, నియమించినందుకు 2.03 లక్షల ఓటర్ల జాబితా తయారైందన్నారు. ఇదే క్రమంలో పోలింగ్ బూత్‌ల వద్ద కనీస సౌకర్యాల ఏర్పాటు, ఇతర అంశాల గురించి సమీక్షలో చర్చించామన్నారు.

గ్రూప్-2 మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా గ్రంథాలయంలో గ్రూప్-2 మెటీరియల్ ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ మాట్లాడుతూ మెగా డిఎస్‌సి ఎక్కడని రాష్ట్రంలో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులను, ఇతర ప్రభుత్వ రంగంలో ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని అన్నారు. ఇప్పటికే యువకులను మోసం చేసింది చాలని ఇకనైనా యువకులకు మంచి మార్గాన్ని చూపించాలని అన్నారు. ఉద్యోగులు వేల రూపాయలు ఖర్చుపెట్టి కోచింగ్ తీసుకుంటున్నారు కానీ ఉద్యోగ నోటిఫికేషన్ వెలువడటంలేదన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా యూత్ ఆఫీసర్ డి.కిషోర్ విద్యార్థులకు గ్రూప్-2 గురించి వాళ్లకున్న డౌట్లు పూర్తి చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వి.ఠాగూర్ పాల్గొన్నారు.

రేపు భూహక్కు యాజమాన్య చట్టంపై సమావేశం

ఏలూరు అర్బన్ : ఆంధ్రప్రదేశ్ భూమి హక్కుల యాజమాన్య చట్టం 2022 పూర్వపరాలు, పరిణామాలు అనే అంశంపై ఏలూరు చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీ శుక్రవారం ఏలూరులో సమావేశం ఏర్పాటు చేసినట్లు చైతన్య వేదిక అధ్యక్షులు, న్యాయవాది పిఎస్ చందు ఒక ప్రకటనలో తెలిపారు. అందరూ హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

జనసేన కార్యాలయం ప్రారంభం

పోలవరం: మండలంలో జనసేన మండల అధ్యక్షులు గుణపర్తి వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నిర్మించారు. ముఖ్య అతిథులుగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్, పోలవరం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి చిర్రి బాలరాజు పాల్గొని జనసేన మండల కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి పాదం కృష్ణ, మద్దు తేజా, పసుపులేటి రాము పాల్గొన్నారు.

మండలాన్ని అభివృద్ధి చేయాలి

ముసునూరు : పంచాయతీరాజ్ నిధులతో మండలాన్ని అభివృద్ధి చేయాలని రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దె రఘుబాబు రాష్ట్రస్థాయి అధికారులను కోరారు. బుధవారం రాష్ట్రస్థాయి మంగళగిరి పంచాయతీరాజ్ కార్యాలయానికి ముసునూరు మండలం సర్పంచులు, మాజీ ఉమ్మడి కృష్ణాజిల్లా ఛైర్‌పర్సన్ గద్దే అనురాధ, జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు కలిసి రాష్ట్రంలో మండలాలు, గ్రామాలు అభివృద్ధిలో శూన్యంగా కనబడుతున్నాయని రాష్ట్ర పంచాయతీ అధికారులకు వివరించారు. మాజీ జెడ్‌పిటిసి చిలుకూరి వెంకటేశ్వరరావు, సర్పంచులు తల్లిబోయిన రాధిక సత్యనారాయణ, గద్దల సుహాసిని మోహన్ రావు, ఉపసర్పంచి కాటేపల్లి సత్యనారాయణ, చిలుకూరి దేవేంద్ర పాల్గొన్నారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

ముసునూరు : అట్లూరి చారిటబుల్ ట్రస్ట్ వారి సౌజన్యంతో గురువారం మండలంలో రమణక్కపేట గ్రామంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అట్లూరి చారిటబుల్ ట్రస్ట్ అధినేత అట్లూరి రవీంద్ర విలేకరులతో పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు రమణక్కపేట పంచాయతీ కార్యాలయం వద్ద రాష్ట్రస్థాయి నేత్ర వైద్య బృందం ఆధ్వర్యంలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, వారికి సంబంధించిన మందులు, కంటి ఆపరేషన్లు ఉచితంగా చేయబడునని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ వైద్య సేవలు వినియోగించుకోవాలి

పోలవరం : ప్రతి ఒక్కరూ ప్రసవాలు ప్రభుత్వాసుపత్రిలోనే జరిపించుకుని ప్రభుత్వ వైద్య సేవలు వినియోగించుకోవాలని పోలవరం ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రం సూపరిండెంట్ ఎంవి.సతీష్ బాబు సూచించారు. బుధవారం పోలవరం ప్రభుత్వాసుపత్రిలో కాన్పు జరుపుకున్న ఎడ్లగూడెం గ్రామానికి చెందిన మహిళకు చీర, శిశువుకి కొత్త బట్టలు ఇచ్చి తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో సాగనంపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది శివ, తేజ, లలిత, మాలతి, శాంతి పాల్గొన్నారు.

40 మంది బైండోవర్ : ఎస్ఐ

ఆగిరిపల్లి : ఉన్నతాధికారుల ఆదేశానుసారం సంక్రాంతి పండుగను పురష్కరించుకొని పేకాట, కోడిపందేలను నివారించుటలో భాగంగా గతంలో జూదాలు నిర్వహించిన 40 మందిని ముందస్తుగా బైండోవర్ చేసినట్లు ఆగిరిపల్లి ఎస్ఐ ఎస్.చంటిబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంప్రదాయ క్రీడలతో సంక్రాంతి పండుగను ఆనందంగా జరుపుకోవాలన్నారు.